క్లుప్తంగా

కనుల పండువగా హనుమాన్ శోభాయాత్ర


శోభాయాత్రలో పాల్గొన్న భక్తులు

జన్నారం: మండలంలోని పైడిపెల్లి ఆంజనేయస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ పురస్కరించుకొని హనుమాన్ భక్తులు చేసిన శోభాయాత్ర కనుల పండువగా సాగింది. పైడిపెల్లి ఆలయం నుంచి ప్రధాన రహదారి మీదుగా శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. శోభాయాత్ర సందర్భంగా జన్నారం మండల కేంద్రం కాషాయమయంగా మారింది. బీజేపీ మండల అధ్యక్షుడు మధుసూదన్ రావు, జిల్లా కార్యదర్శి కొంతం శంకరయ్య, మాజీ అధ్యక్షుడు గోలి చందు, హనుమాన్ భక్తులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు టీ షర్టులు అందజేత


టీం సభ్యులతో అశోక్‌యాదవ్, ఎస్సై రాములు

భీమారం: గొర్రెలు, మేకలు పెంపకందారుల సంఘం ఆధ్వర్యంలో శనివారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాజిపల్లి గ్రామానికి చెందిన 13మంది క్రికెట్ క్రీడాకారులకు జెర్సీ టీ షర్టులను సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొమ్ము అశోక్ యాదవ్, ఎస్సై రాములు కలిసి అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్సై భూమన్న పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రాల పరిశీలన


అంగ్రాజ్‌పల్లిలో భోజనం గురించి పిల్లలను అడిగి తెలుసుకుంటున్న సీడీపీవో


చెన్నూర్‌రూరల్: మండలంలోని అంగ్రాజ్‌పల్లి, కత్తెరసాల గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను శనివారం సీడీపీవో మనోరమ పరిశీలించారు. కేంద్రాలలో పిల్లల హాజరు శాతం, పౌష్టికాహారం వివరాలు తెలుసుకున్నారు. చిన్న పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు పౌష్టికాహారం తప్పకుండా అందించాలని తెలియజేశారు.

వృద్ధులకు బెడ్‌షీట్స్, బ్లాంకెట్స్ పంపిణీ


పంపిణీ చేస్తున్న రితీష్‌కుమార్ గుప్తా

మంచిర్యాలటౌన్: ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆనంద నిలయం (వృద్ధులు, పిల్లల ఆశ్రమాలు) లో శనివారం స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా మంచిర్యాల బ్రాంచ్ రీజినల్ మేనేజర్ రితీష్‌కుమార్ గుప్తా ఆధ్వర్యంలో ఆశ్రమంలోని వృద్ధులకు, పిల్లలకు బెడ్‌షీట్స్, బ్లాంకెట్స్ పంపిణీ చేశారు. మూడు రకాల పండ్లతో పాటు రూ.30వేల విలువ గల వస్తువులను విరాళంగా అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఎస్‌బీఐ చీఫ్ మేనేజర్ అలోక్ వర్మ, సాగర్ రావు, శ్రీనివాస్ మూర్తి, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ స్టేట్ మేనేజింగ్ కమిటీ మెంబర్ వి.మధుసూదన్ రెడ్డి, కార్యదర్శి మహేందర్, కోశాధికారి సత్యపాల్ రెడ్డి, ఎంసీ మెంబర్ సత్యనారాయణ రెడ్డి పాల్గొన్నారు.

సీహెచ్‌పీలో సమస్యలు పరిష్కరించాలి


వినతిని అందిస్తున్న నాయకులు

రామకృష్ణాపూర్: మందమర్రి ఏరియా పరిధిలోని ఆర్‌కేపీ సీహెచ్‌పీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ హెచ్‌ఎంఎస్ నాయకులు శనివారం సీహెచ్‌పీ ఇంజినీర్ అశోక్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. ఇతర సీహెచ్‌పీల మాదిరిగా రేక్ లోడ్ జరుగుతున్నప్పుడు రన్నింగ్ చార్జి ఉన్న కార్మికులకు ఒక గంట ఓటీ కట్టివ్వాలని, అలాగే కార్మికులకు ప్రోత్సాహక బహుమతులు అందించాలని కోరారు. హెచ్‌ఎంఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు జె.శ్రీనివాస్, రామస్వామి, సుదర్శన్ తదితరుల పాల్గొన్నారు.

పంచాయతీల ఖజానా ఖాళీ


రాజారం గ్రామపంచాయతీ కార్యాలయం

- వేధిస్తున్న నిధుల కొరత
- నామమాత్రంగా ప్రత్యేకాధికారుల పాలన


చెత్తను సేకరిస్తున్న గ్రామపంచాయతీ సిబ్బంది

కోటపల్లి/మంచిర్యాలరూరల్(హాజీపూర్): చిన్న గ్రామపంచాయతీలు ఏర్పడిన తర్వాత నిర్వహణ కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతినెలా నిధులు మంజూరు చేసేవి. ఆయా నిధుల సాయంతో ప్రజాప్రతినిధులు, కార్యదర్శులు పంచాయతీలలో పనులు చక్కగా చేయించి అందరి మన్ననలు పొందేవారు. సర్పంచుల పాలనాకాలంలోనే రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధుల మంజూరు లేకపోవడం, పార్లమెంట్ ఎన్నికల ప్రకటన నాటి నుంచే కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరయ్యే 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు నిలిచిపోయింది. మార్చి నాటికి వసూల్ చేసిన ఇంటి పన్నులను జనరల్ ఫండ్ ఖాతాలో జమ చేసిన కార్యదర్శులు, ఏ అవసరం వచ్చినా ఖాతాలో నిధులను వినియోగించుకుంటూ కొంతకాలం వెళ్లదీశారు.

పేరుకుపోయిన అప్పులు...

గ్రామపంచాయతీలలో అరకొరగా ఉన్న నిధుల నిల్వలను విద్యుత్ బిల్లులు, ట్రాక్టర్ ఈఎంఐల చెల్లింపునకు వినియోగిస్తున్నారు. ఇతర ఏ అవసరం ఉన్నా అప్పులు చేయక తప్పని పరిస్థితి. ఇంతే కాకుండా గ్రామపంచాయతీలలో గతంలో పనిచేసిన సర్పంచులు తమ పదవీ కాలంలో చేసిన పనులకు నిధుల చెల్లింపు నేటికీ బకాయిగానే ఉండిపోయింది. కొన్ని పంచాయతీలలో ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం నాటికి కార్యదర్శులు గ్రామపంచాయతీలలో ఒక్కరూపాయి లేకుండా అన్ని పైసలను ఇష్టారాజ్యంగా వాడుకున్నారు. ప్రతి రోజు పారిశుధ్య పనులలో భాగంగా ఇంటింటా చెత్త సేకరణ కోసం వినియోగించే ట్రాక్టర్ డీజిల్ కొనుగోలు కార్యదర్శులకు సమస్యగా మారింది. వీటికి తోడు వేసవిలో నీటిఎద్దడి నివారణ పేరుతో పైపులైన్ చేతిపంపులకు మరమ్మతుల పేరిట బిల్లులను కొన్ని గ్రామాల్లో కార్యదర్శులు కాజేశారు. గత ప్రభుత్వం మిషన్ భగీరథ పేరుతో గ్రామాల్లో నీటిని అందించామని చెప్పుకున్నప్పటికీ కార్యదర్శులు ఇలా బిల్లులు చేతిపంపుల మరమ్మతులపై బిల్లులు లేపడంలో ఆంతర్యమేమిటని మండలవాసులు ప్రశ్నిస్తున్నారు. నర్సరీలకు షెడ్‌నెట్, ఎరువులు, నీటి సౌకర్యం వంటివన్నీ అప్పులు చేసి సమకూర్చుతున్నామని కార్యదర్శులు చెప్పుకుంటున్నారు. వర్షాలు సమీపిస్తున్నందునా బ్లీచింగ్ పౌడర్ సిద్ధం చేయాలని, మురుగుకాల్వలు శుభ్రం చేయించాలని, నీరు నిల్వ ఉండే ప్రదేశాలను గుర్తించి మట్టితో పూడ్చివేయాలన్న ఆదేశాలు కార్యదర్శులకు కంటికి కునుకులేకుండా చేస్తున్నాయి.

వచ్చేది వర్షాకాలం...

ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నాయి. ఈ సమయంలో పారిశుధ్య పనులు అటకెక్కితే రానున్న రోజుల్లో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం లేకపోలేదు. అన్ని సక్రమంగా సాగిన సమయంలోనే దోమల బెడదతో ప్రజలు జ్వరాల బారిన పడి తీవ్రంగా ఇబ్బంది పడేవారు. అటువంటిది పారిశుధ్య పనులు చేయకపోతే పరిస్థితి ఎలా ఉంటుందో వేరే చెప్పనవసరం లేదు.

నామమాత్రంగానే ప్రత్యేకాధికారులు...

సర్పంచుల పదవీకాలం ముగియడంతో పంచాయతీలలో ప్రత్యేక అధికారులను ప్రభుత్వం నియమించింది. కానీ వారి పాలన నేడు నామమత్రంగానే కనిపిస్తోంది. ఫైళ్లపై సంతకాలు చేయడానికి మినహా, పంచాయతీల నిర్వహణ, అభివృద్ధిలో వారి భాగస్వామ్యం శూన్యమేనని చెప్పాలి. ప్రస్తుతం పంచాయతీలలో నిధుల లేమి సమస్యగా మారడం, కార్మికులకు వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొనడంపై ప్రత్యేకాధికారులు దృష్టిసారించడం అటుంచితే, సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం కూడా చేయకపోవడం విచారకరం.

పాలనపై తీవ్ర ప్రభావం...

కాసింత పెద్ద పంచాయతీలకు ఆదాయం కొంత పర్వాలేదన్న స్థాయిలో సమకూరుతోంది. గతంలో మంజూరైన నిధులు, పాత బకాయిలు చెల్లించకుండా అలాగే నిల్వ ఉంచుకున్న గ్రామపంచాయతీలను మినహాయిస్తే చిన్న పంచాయతీలతో పాటు మరి కొన్ని పెద్ద గ్రామపంచాయతీలలో నిధుల లేమి ప్రధాన సమస్యగా మారింది. వచ్చేనెల అత్యధిక గ్రామపంచాయతీలలో వేతనాలు ఇతరత్ర ఖర్చులు అటుంచితే కనీస నిర్వహణ కూడా మరీ భారంగా మారే పరిస్థితి నెలకొంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి తక్షణం నిధులు విడుదల చేయని పక్షంలో పంచాయతీలు పడకేసే ప్రమాదం ఉంది.

నిధుల కొరత సమస్యగా ఉంది

గ్రామపంచాయతీలకు నిధుల మంజూరు లేకపోవడంతో నిర్వహణ భారంగా మారింది. చాలా మంది కార్యదర్శులు పంచాయతీల నిర్వహణ విషయంలో తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని పంచాయతీలలో కార్మికుల వేతనాల చెల్లింపులు కూడా నిలిచిపోయాయి. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– అక్తర్, మండల పంచాయతీ అధికారి

అటెన్షన్ ప్లీజ్..



భీమారం: మండల కేంద్రంలోని బస్టాండ్ నుంచి ఎస్సీకాలనీకి వెళ్లే ప్రధాన రహదారిపై గల రోడ్డు డ్యాం వద్ద పంటపొలాలతోపాటు డ్రెయినేజీల ద్వారా వచ్చే మురుగు నీరు నిలిచిపోవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. అటుగా వెళ్తున్న అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు చర్యలు తీసుకొని, మురుగు నీరు సక్రమంగా వెళ్లేలా చూడాలని కోరుతున్నారు.

సంబంధిత అధికారి : సతీష్‌రెడ్డి, గ్రామ ప్రత్యేకాధికారి, భీమారం
ఫోన్ నంబర్ : 98483 84636

ధాన్యం కొనుగోళ్లు త్వరగా పూర్తి చేయాలి


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్

తాండూర్: ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలని తాండూర్ తహసీల్దార్ ఇమ్రాన్ ఖాన్ సూచించారు. మండలంలోని రేచిని, ద్వారకాపూర్, అచ్చలాపూర్ గ్రామాల్లో శనివారం ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. స్థానిక రైతులను ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మండల వ్యాప్తంగా ప్రస్తుతం అన్ని వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో మూడు టన్నులకు మించి ధాన్యం లేదని, ధాన్యం తరలింపును త్వరితగతిన చేపట్టాలని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సీఈవో శ్రీనివాస్‌కు సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. వానాకాలం సమీపిస్తున్నందునా రైతులకు నష్టం వాటిల్లకుండా చూడాలన్నారు. తహసీల్దార్ వెంట రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అంజన్ కుమార్, సిబ్బంది, రైతులు ఉన్నారు.

కాంగ్రెస్ ఎస్సీ సెల్ నియోజకవర్గ ఉపాధ్యక్షుడిగా విజయ్


విజయ్‌కి నియామకపత్రం ఇస్తున్న ఎమ్మెల్యే

బెల్లంపల్లి: అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా కాసిపాక విజయ్ నియామకం అయ్యాడు. ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు నాగరి ప్రీతం, జిల్లా అధ్యక్షుడు రామగిరి బానేష్ ఆదేశాల మేరకు బెల్లంపల్లి మండలం దుగినేపల్లి గ్రామానికి చెందిన విజయ్‌ని ఉపాధ్యక్షుడిగా నియమిస్తూ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షుడు రేగుంట రాజలింగు నియామక ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మేరకు శనివారం బెల్లంపల్లిలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే గడ్డం వినోద్ విజయ్‌కి నియామకపత్రం అందజేసి అభినందించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ ప్రచార కమిటీ రాష్ట్ర సభ్యుడు నాతరి స్వామి, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు రాజలింగు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పొట్ల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

'టేకులకుంట మా సొంత భూమి'


మాట్లాడుతున్న రైతులు

చెన్నూర్: మండలంలోని కంబోజీపేటలో గల టేకులకుంట మా సొంత భూమి అని కిష్టంపేట రైతులు మేడ రాంరెడ్డి, మేడ బాన్‌రెడ్డి, అంకిరెడ్డి అన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కొందరు ఈ కుంటను కబ్జా చేశారని ప్రచారం చేయడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని రైతులు తెలిపారు. 30 ఏళ్ల క్రితం మా కుటుంబీకులు మా పంట పొలాలకు నీటి వసతి కోసం కుంటను సొంత ఖర్చులతో ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. ఈ కుంట నిర్మాణానికి ప్రభుత్వం నుంచి ఎలాంటి నిధులు వినియోగించలేదన్నారు. పంట సాగు కోసం టేకులకుంట స్థలాన్ని తాము చదును చేస్తుండగా కొందరు వ్యక్తులు కుంటను కబ్జా చేస్తున్నారని అనడం భావ్యం కాదన్నారు. నిజనిజాలు తెలుసుకొని, రెవెన్యూ రికార్డులు పరిశీలించాలన్నారు. తరతరాలుగా వస్తున్న మా భూమిలో మేము చదును చేసుకోవడం తప్పా అని ప్రశ్నించారు. తప్పుడు ప్రచారం చేస్తే చట్ట పరమైన చర్యలు తీసుకునేందుకు వెనుకాడమని హెచ్చరించారు. కార్యక్రమంలో టేకులకుంటా రైతులు పాల్గొన్నారు.

'సర్టిఫికేట్ల జారీలో అలసత్వం ప్రదర్శించొద్దు'


రికార్డులు పరిశీలిస్తున్న అంజన్‌కుమార్

తాండూర్: విద్యార్థులకు సర్టిఫికేట్ల జారీ విషయంలో మీసేవ నిర్వాహకులు ఎలాంటి అలసత్వం ప్రదర్శించవద్దని రెవెన్యూ ఇన్స్‌స్పెక్టర్ అంజన్‌కుమార్ సూచించారు. మండలంలోని పలు మీ సేవ కేంద్రాలను శనివారం ఆయన పరిశీలించారు. కాలేజీలు, పాఠశాలలు ప్రారంభం కానున్న నేపథ్యంలో విద్యార్థులను సర్టిఫికెట్స్ జారీ చేయడంలో ఇబ్బందులకు గురి చేయొద్దన్నారు. మీ సేవ నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు.

ఆదరించండి.. ఆదుకోండి..!


చిన్నారులకు కర్రసాము నేర్పుతున్న రాజారమేష్

- ఎన్ని పతకాలు సాధించినా ఉపాధి శూన్యం
- ప్రభుత్వం తరఫున సాయమందించాలని వేడుకోలు

మందమర్రిరూరల్: మందమర్రి పట్టణానికి చెందిన కరాటే మాస్టర్ తోట రమేష్ రాజా చేతులతో నేలపై నడుస్తూ, గాజు పెంకలు తలతో పగులగొట్టడం, కాళ్లపై నుంచి వ్యాను, ట్రాక్టర్ పోనియ్యడం, మినీ రోడ్డు రోలర్‌ను చేతులపై పోనియ్యడం, చేతులపై నుంచి బస్సు, లారీలు పోనియ్యడం, ఛాతిపై 100కిలోల బండను పగులగొట్టడం, కిక్స్‌తో సిమెంట్ ఇటుకలు పగులగొట్టడం, వీపుపై భాగం నుంచి ట్రాక్టర్, వ్యాన్ పోనియ్యడం తదితర సాహసాలు చేయడంలో ఆయన దిట్టా. పలు కళల్లో నైపుణ్యం సాధించి ఎన్ని సాహసాలు చేసి అవార్డులు, రివార్డులు సాధించారు. కానీ ప్రస్తుతం జీవితంలో స్థిరపడలేక, కుటుంబాన్ని సాకలేక జీవనోపాధికి ఇబ్బందిగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అనేక అవార్డులు, రివార్డులు సాధించినా అనేక మంది అధికారులు, ప్రజాప్రతినిధులు అభినందనలు, ప్రశంసలు అందిస్తున్నారు తప్పా, అవి జీవనోపాధికి ఎంత మాత్రం ఉపయోగపడడం లేదని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం తరపున ఆర్థిక సాయం చేసినట్‌లెతై ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేస్తానని పేర్కొంటున్నాడు. ఆయన కోల్‌బెల్ట్ రియల్ సాహస వీరుడు, స్ట్రాంగ్‌మెన్, కరాటే ఛాంపియన్‌గా బిరుదులు సాధించాడు. తెలంగాణ రికార్డు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్, హైరేంజ్ వరల్డ్ రికార్డ్, జీనియస్ రికార్డ్, వండర్ బుక్ రికార్డ్, లిమ్కా బుక్ రికార్డ్, ఫెంటాస్టిక్ రికార్డ్, ఆస్కార్ రివార్డ్, తెలంగాణ రియల్ సాహసవీరుడు, బెస్ట్ నాన్ చాక్ ఫైటర్ అవార్డులు పొందారు.

నకిలీ విత్తనాలతో నష్టపోవద్దు

- రైతులకు వ్యవసాయాధికారుల సూచన


కాజిపల్లిలో మాట్లాడుతున్న ఏఈవో అరుణ్‌కుమార్


తాండూర్: అవగాహన కల్పిస్తున్న ఏడీఏ సురేఖ

తాండూర్: రైతులు ప్రభుత్వ అనుమతి లేని నకిలీ విత్తనాలను దళారుల నుంచి కొనుగోలు చేసి మోసపోవద్దని బెల్లంపల్లి ఏడీఏ సురేఖ సూచించారు. మండలంలోని కొత్తపల్లి, రేచిని, ద్వారకాపూర్ గ్రామాల్లో రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె వెంట వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ధనలక్ష్మి, పుష్పలత, సిబ్బంది పాల్గొన్నారు.

కోటపల్లి: వానాకాలం సాగుకు సన్నద్ధమవుతున్న రైతులు నకిలీ విత్తనాలను వాడి నష్టపోవద్దని మండల వ్యవసాయాధికారి మహేందర్ అన్నారు. సిర్సా, ఎదులబంధం, లింగన్నపేట, దేవులవాడ, నక్కలపల్లి, పంగిడిసోమారం గ్రామాల్లో శనివారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో నకిలీ విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. లైసెన్సులు ఉన్న దుకాణాల్లోనే విత్తనాలు కొనుగోలు చేయాలని, ప్యాకింగ్, కంపెనీ పేరు వివరాలను పరిశీలించాలని తెలిపారు. బిల్లులను తప్పకుండా తీసుకోవాలని సూచించారు. నకిలీ విత్తనాలు అమ్మినా, వినియోగించినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఈవోలు వైష్ణవి, అనుష, శేఖర్, రాజుకుమార్ పాల్గొన్నారు.

నెన్నెల: మండలంలోని కుశ్నపల్లి, కోణంపేట గ్రామ రైతులకు లూజ్ పత్తి విత్తనాలు (గ్లెస్టైల్ పత్తి విత్తనాలు) వాడకూడదని ఏఈవో రాంచందర్ అవగాహన కల్పించారు. అలాంటి విత్తనాలు వాడితే క్యాన్సర్ బారిన పడతారని, ప్రభుత్వం నుంచి ఎటువంటి పర్మిషన్ లేనందునా లూజ్ పత్తి విత్తనాలు వాడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏఈఓలు సుప్రజ, మౌనిక పాల్గొన్నారు.

భీమిని: నకిలీ విత్తనాలు కొనుగోలు చేసి మోసపోవద్దని ఏఈవో వినోద్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో రైతులకు నకిలీ విత్తనాలపై అవగాహన కల్పించారు. రైతులు విత్తనాల కొనుగోలు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు.

భీమారం: విత్తనాల కొనుగోళ్ల విషయంలో ప్రతీ రైతు అప్రమత్తంగా ఉండాలని ఏఈవో అరుణ్‌కుమార్ కోరారు. నర్సింగాపూర్‌లో ఖరీఫ్ విత్తనాల కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. వ్యవసాయశాఖ గుర్తింపు పొందిన షాపుల ద్వారానే విత్తనాలు కొనుగోలు చేయాలన్నారు. కాజిపల్లిలో సమావేశం నిర్వహించారు.

కాసిపేట: రైతులు విత్తనాల కొనుగోలు రిజిస్టర్ డీలర్ల వద్దనే చేయాలని, కొనుగోలు సమయంలో సంబంధిత డీలర్ నుంచి రశీదు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి వందన తెలిపారు. మండలంలోని కాసిపేట, సోనాపూర్ గ్రామపంచాయతీల్లో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవో రమ్య, రైతులు పాల్గొన్నారు.

దండేపల్లి: ఖరీఫ్ సీజన్ ప్రారంభం అవుతున్నందునా రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తగా ఉండాలని మండల వ్యవసాయాధికారి అంజిత్ సూచించారు. మండలంలోని మామిడిపల్లిలో రైతులకు విత్తనాల కొనుగోలుపై అవగాహన కల్పించారు. ఏఈవో సృజన్య, రైతులు పాల్గొన్నారు.

లక్సెట్టిపేట: రైతులు విత్తనాలు కొనుగోలు చేస్తే రశీదులు తప్పనిసరిగా తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి చెల్లా ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని బలరావుపేట, మోదెల, ఊత్కూరు, మిట్టపల్లి, హన్మంతుపల్లి గ్రామాల్లో శనివారం రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈవోలు ప్రభాకర్, ప్రసన్న, గోవర్దన్ రెడ్డి, ఇర్ఫాన్, శ్రీనివాస్, అనుష రైతులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: విత్తనాల కొనుగోలు విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి ముత్యం తిరుపతి సూచించారు. మండలంలోని సారంగపల్లిలో రైతులకు విత్తనాల కొనుగోళ్లపై అవగాహన కల్పించారు.

మహిళా సాధికారతపై అవగాహన



మంచిర్యాలటౌన్: మంచిర్యాల పట్టణంలోని సెవెన్ హిల్స్ హై స్కూల్, జ్యోతి వర్కింగ్ ఉమెన్ హాస్టల్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖలోని జిల్లా సంక్షేమ అధికారి ఆదేశాల మేరకు మహిళా సాధికారతపై శనివారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా సాధికారత హబ్ జెండర్ స్పెషలిస్ట్ మౌనిక, ఫైనాన్సిల్ లిటీరసి లిప్సికలు మాట్లాడుతూ.. భేటీ బచావో, భేటీ పడావో పథకం, లింగ వివక్షత, లింగ సమానత్వం, బాల్య వివాహాల నిరోధక చట్టం, డిజిటల్ ఎడ్యూకేషన్, సైబర్ క్రైమ్‌లపై అవగాహన కల్పించారు. సుకన్య సమృద్ధి యోజన, మిషన్ వాత్సల్య, 112ఆడ పిల్లల ప్రాముఖ్యతల గురించి వివరించారు. సెవెన్ హిల్స్ హైస్కూల్ ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, టీచర్స్, జ్యోతి వర్కింగ్ ఉమెన్ హాస్టల్ వార్డెన్ జ్యోతి, ఉమెన్స్, విద్యార్థులు పాల్గొన్నారు.

'రైతులకు అన్యాయం జరగకుండా చూడాలి'

కోటపల్లి: మండలంలోని కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలింపు ఆలస్యం అవుతున్నా, చెన్నూర్ ఎమ్మెల్యే రైతులను గా లికొదిలేసి విదేశాల్లో సేదతీర్చుకుంటున్నారని బీఆర్ఎస్ పార్టీ నాయకులు డాక్టర్ రాజా రమేశ్ అన్నారు. బబ్బరుచెల్క, దేవులవాడ కొనుగోలు కేంద్రాలను శనివారం పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి రైతులను ఎండకు, వానకు గాలికి వదిలేసి విదేశాల్లో సేదతీర్చుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులైనా మళ్లీ వర్షాలు పడకముందు వడ్లను కొనుగోలు కేంద్రాల నుంచి లారీలతో తరలించి రైతుల కు అన్యాయం జరగకుండా చూడాలని కోరా రు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సాంబగౌడ్, యూత్ అధ్యక్షుడు విద్యాసాగర్, నాయకులు పాల్గొన్నారు.

వాడ బలిజల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేయాలి


పతాకావిష్కరణ చేస్తున్న సభ్యులు

పాతమంచిర్యాల: వాడ బలిజల అభివద్ధి సంక్షేమం కోసం ప్రభుత్వం కృషి చేయాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు బోడంకి మహేష్ అన్నారు. జిల్లా కేంద్రంలోని అండర్ బ్రిడ్జి వద్ద శనివారం వాడబలిజ సేవా సంఘం ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరణ చేశారు. కార్యక్రమంలో వాడబలిజ సేవా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షుడు ఎర్రోళ్ల మల్లయ్య, పట్టణ అధ్యక్షుడు సత్తయ్య, కోశాధికారి రాజన్న, జిల్లా కమిటీ సభ్యులు రాజన్న, బుద్ధి మల్లేష్, తిరుపతి, కార్తికేయ, అజయ్, మాదవ్ పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మంచిర్యాల:
9010299065, 9951602823
Office mail : knrjagati@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
తిరుపతి, ACO - 7997958206
మంచిర్యాల : సల్మాన్‌ఖాన్ - 7995855506
బెల్లంపల్లి : సంపత్ - 7036227114
టోల్ ఫ్రీ నెం. : 1800 425 9899